అంత తీసుకోవాలి. ఐదు రూపాయలైనా డబ్బే. పది రూపాయలైనా డబ్బే. చాలకపోతే అడిగి తీసుకోవాలి. అంతేగానీ ఇచ్చినవాణ్ని అవమానించే హక్కులేదు నీకు'' అన్నాడు.

బిచ్చగాడు మౌనంగానే తీసుకున్నాడు. వినీత్ ఇచ్చిన డబ్బు లెక్కపెట్టాడు. ఆ తరువాత..

''నేను అడుక్కునేవాడినని ఎవరు చెప్పారు మీకు?'' అంటూ, ఆ డబ్బుని వినీత్ చేతిలో పెట్టేసి మళ్లీ భావరాహిత్యంలోకి వెళ్లిపోయాడు.

వినీత్‌కి ఒక్కసారిగా చెళ్లున చెంప పగలగొట్టినట్లయింది. ఆ తరువాత తను ఆవేశంతో ఎన్ని మాట్లాడినా, ఎన్ని మాటలన్నా ఆ బిచ్చగాడి నుంచి సమాధానంగా వచ్చింది మాత్రం కేవలం శూన్య దృక్కులే. చివరికి తనే మౌనం వహించి, వెనుదిరక్క తప్పలేదు.

* * *

వినీత్‌కి ఆరోజంతా పదేపదే గుర్తొస్తూనే ఉన్నాడా బిచ్చగాడు. అతనితో పంతానికిపోయి అవమానం పాలైనందుకు కాదు. అసలా గెడ్డం యువకుడు ఎవరు? ఎందుకక్కడే ఉంటున్నాడు? అతని సమస్యేమిటి? అక్కడే కూర్చుంటే పూటెలా గడుస్తుంది? అన్నీ ప్రశ్నలే. అన్ని ప్రశ్నలెదురైనా ఆ బిచ్చగాడితో నాకెందుకు? అనే ప్రశ్నమాత్రం పుట్టలేదు.

మర్నాడు గుడికెళ్లేప్పుడు వంతెన ఇవతలి వైపు కాకుండా అవతలి వైపు నుంచి వెళ్లాడు. కానీ వచ్చేప్పుడు మాత్రం బిచ్చగాడి మాట మర్చిపోయాడు. అందుకే ఇవతలి వైపుగా వచ్చేశాడు. తన మతిమరుపును తనే తిట్టుకుంటూ హడావుడిగా నడుస్తున్నాడు. బిచ్చగాడి దగ్గరకొస్తున్న కొద్దీ ఏదో జంకు. ఏదో అపరాధభావం. కానీ, ఆ మనిషి చూపులు మాత్రం అలాగే ఉన్నాయి.. భావరహితంగా! ఇప్పుడెందుకో ఆ మనిషి గురించి 'బిచ్చగాడు' అనుకోవడానికి కూడా తటపటాయిస్తున్నది మనసు.

ఉంది.. ఏదో ఉంది. ఆ మనిషిలో తను ఊహించనిదేదో ఉంది. అందుకే చూపులు తిప్పుకోలేక పోతున్నాడు. అలా చూస్తుంటే మనసులోకి వస్తున్న ఆలోచనలన్నీ దగ్గరదాకా వచ్చి అక్కడే ఆగిపోతున్నాయి. తన జీవితంలో స్నిగ్ధ ప్రేమ తప్ప మరేదీ ఇంతగా వేటాడలేదు. అందుకే అతణ్ని దాటి వెళ్లిపోతున్నప్పుడు వినీత్ కాళ్లు సన్నగా కంపించాయి.

ఆ రాత్రి ఫోన్‌లో స్నిగ్ధతో మాట్లాడుతూ వంతెన యువకుడి గురించి చెప్పాడు.

''అలాంటి మనుషుల్లో మనం చదవని శాస్త్రాలు, మనం చూడని సత్యాలు ఎన్నో ఉంటాయి. వదిలిపెట్టద్దు. విషయం కనుక్కో!'' అన్నది స్నిగ్ధ. సమయానికి తగిన సలహాలివ్వడంలోనూ, సహకారం అందించడంలోనూ తనని మించినవారు లేరు.

రాత్రంతా ఆ యువకుడికి పూటెలా గడుస్తుందో తెలుసుకోవాలన్న ఆలోచనతోనే గడిచిపోయింది.

మరునాటి ఉదయం ఫలహారం చేస్తున్నప్పుడు వచ్చిందో ఆలోచన. వెంటనే రెండు ఇడ్లీలు, మసాలా దోశ పొట్లం కట్టించుకున్నాడు వినీత్. అరడజను పూతరేకులు కూడా కొన్నాడు. తిన్నగా గెడ్డం యువకుడి దగ్గరికి వెళ్లాడు. వినీత్ చేతిలోని పొట్లాలు చూడగానే భావరహితమైన ఆ శూన్యదృక్కుల్లోకి ఒక్కసారిగా చైతన్యం వచ్చింది. ఇవ్వకముందే పొట్లాలు లాగేసుకున్నాడు.. పూతరేకుల్ని ఒళ్లో పెట్టుకున్నాడు. ఇడ్లీ విరుచుకుని తినబోయే ముందు వినీత్ వైపు చూస్తూ..

''అన్నదాతా సుఖీభవ!'' అన్నాడు. అక్కడితో ఆగలేదు,

''తినగా మిగిలింది ఊరికే పడెయ్యడం ఎందుకని నాకు ఇస్తారంతే! కానీ ఇలా నాకోసం ప్రత్యేకంగా తీసుకొచ్చింది మీరొక్కరే!'' అన్నాడు.



> **''పది లక్షలు?.. చెప్పండి, ఇవ్వగలరా? మీరు ఇవ్వలేకపోయినా ఇవ్వగలిగినవాళ్లు సిద్ధంగా ఉన్నారు. కానీ, నాకు కావాల్సింది డబ్బు కాదు. ఎందుకంటే.. డబ్బు కొనలేనివి ఎన్నో ఉంటాయి. నాకు కావాల్సింది మీ దగ్గర ఉంది. మీ దగ్గరే కాదు.. అందరి దగ్గరా ఉంది. కానీ, ఎవ్వరూ ఇవ్వరు. ఇవ్వనిదాన్ని దానంగా కోరడంలో అర్థం లేదు!''.**

అతను తింటుండటాన్ని చూసి తృప్తిగా ముందుకు నడిచాడు వినీత్. అలా నడుస్తుంటే అమ్మ గుర్తొచ్చింది.

'అన్నపూర్ణమ్మ తల్లి పట్టెడన్నంతో అంతులేని తృప్తినిస్తుంది. కానీ, లక్ష్మీదేవికి తృప్తి అనే మాటే తెలీదు. మా చిన్నప్పుడు బియ్యమో పప్పులో కూరలో వేస్తే తీసుకునేవారు. ఇప్పుడు డబ్బులు తప్ప ఇంకేమీ తీసుకోవడం లేదు. మనుషుల్లో తృప్తి అనేదే లేకుండా పోతున్నది' అని బాధపడుతూ ఉంటుంది.

అమ్మ గనుక ఈ యువకుణ్ని చూస్తే ఎంత సంతోషిస్తుందో అనుకున్నాడు.

* * *

హైదరాబాద్ వచ్చిన పని పూర్తయింది. మధ్యాహ్నం తను భోజనం చేశాక గడ్డం యువకుడి కోసం భోజనం కట్టించుకొచ్చాడు వినీత్. ఈ వారం రోజుల్లోనూ వినీత్‌తో కొంచెం స్నేహం కలిసినట్లు అనిపించింది. అందుకే, అతణ్ని అల్లంత దూరంలో చూడగానే సంబరంగా ఎదురొచ్చాడు గడ్డం యువకుడు. భోజనం పొట్లం అందుకున్నాడు.

ఇద్దరూ నడుస్తున్నారు. అతని స్థానం చేరగానే ఒక్కసారిగా చతికిలబడ్డాడు.

వినీత్ జేబులో చెయ్యిపెట్టాడు. అంతకుముందు ఆ యువకుడు వెనక్కిచ్చిన డబ్బు అలాగే మడతపెట్టి ఉంది. దాన్ని బయటికి తీశాడు.

''నేను మా ఊరెళ్లిపోతున్నాను. ఈ డబ్బుంచు! అవసరానికి పనికొస్తుంది''.

''తీసుకుంటాను. కానీ, నాకు కావాల్సినంత మీరివ్వలేరు''.

''ఇచ్చే ప్రయత్నం చేస్తాను. చెప్పండి.. ఎంత కావాలి?''.

''లక్ష?''.

''ఇస్తాను''.

''రెండు లక్షలు?''.

''చూస్తాను''.

''ఐదు లక్షలు?''.

''ఆలోచిస్తాను''.

''పది లక్షలు?.. చెప్పండి, ఇవ్వగలరా? మీరు ఇవ్వలేకపోయినా ఇవ్వగలిగినవాళ్లు సిద్ధంగా ఉన్నారు. కానీ, నాకు కావాల్సింది డబ్బు కాదు. ఎందుకంటే.. డబ్బు కొనలేనివి ఎన్నో ఉంటాయి. నాకు కావాల్సింది మీ దగ్గర ఉంది. మీ దగ్గరే కాదు.. అందరి దగ్గరా ఉంది. కానీ, ఎవ్వరూ ఇవ్వరు. ఇవ్వనిదాన్ని దానంగా కోరడంలో అర్థం లేదు!''.

''నేను మాట తప్పను. ఒకవేళ నేను తప్పాలనుకున్నా మా స్నిగ్ధ తప్పనివ్వదు. అడగండి.. నా దగ్గర ఉన్నదైతే తప్పకుండా ఇస్తాను''.

''అందరూ ఇంతే! అడక్కముందు పెద్ద దానకర్ణుడిలా ఏం కావాలన్నా ఇస్తామంటారు. అడిగాక మళ్లీ ముఖం చూపించరు''.

''అందరూ అలాగే ఉండరు. నిస్సంకోచంగా అడగండి''.

''ఇవ్వడానికి మీరొప్పుకొంటే చాలదు. మీవాళ్లూ ఒప్పుకోవాలి. కానీ, వాళ్లొప్పుకోరు. వాళ్లు ఒప్పుకోకపోతే చట్టం ఒప్పుకోదు''.

''మావాళ్లు ఒప్పుకొంటారో లేదో మీకెలా తెలుసు? కేవలం మీ అనుభవాల్ని మించిన సత్యం ఉండదనే భ్రమలోంచి బయటకు రండి. నిస్సందేహంగా అడగండి.. మీకు కావాల్సిందేమిటి?''.

''నా మూత్రపిండాల్లో ఒకటి చెడిపోయింది. నెలరోజుల్లో మార్చకపోతే నేను బతకను. ఇప్పుడు చెప్పండి.. నాకో మూత్రపిండం దానం చేయగలరా?''. ■

## జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి



కథా నవలా రచయితగా, అనువాదకులుగా తెలుగువారికి చిరపరిచితులు జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి. స్వస్థలం భీమవరం. ఈటీవీలో కన్నడ రచయితగా, మాటీవీలో తెలుగు రచయితగా 30 ఏళ్లు పనిచేశారు. టీవీ సీరియళ్లను హిందీ, కన్నడ భాషలనుంచి తెలుగులోకి అందిస్తుంటారు. ఇప్పటివరకూ వందకుపైగా కథలు రాశారు. 'అంతర్యామి', 'సాక్షాత్కారం' నవలలు; 'ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్', 'ఈ కథకి శిల్పం లేదు', 'నూటొకటో మార్కు', 'తెలకోవెల' కథాసంపుటాలను వెలువరించారు. విశ్వర్షి వాసిలి వసంతకుమార్ యౌగిక కావ్యం 'నేను', బ్రహ్మర్షి ఉమర్ ఆలీషా 'విజ్ఞానజ్యోతి' మొదలైన గ్రంథాలను కన్నడ భాషలోకి అనువదించారు. కేంద్రసాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం పొందిన నవలని 'భలేతాత మన బాపూజీ' పేరుతో తెలుగులోకి తీసుకొచ్చారు. అమెరికన్ తెలుగు అసోసియేషన్ తొలి నవలల పోటీలో 'వలసదేవర' నవలకి మొదటి బహుమతి అందుకున్నారు. 'జంగమదేవర' నవలకి సంయుక్త ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ నుంచి నవలల పోటీలో బహుమతులు పొందారు. ఇవి కాకుండా.. అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్, తెల్సా, నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం, కౌముది, రచన, ఆంధ్రప్రభ, స్వాతి మొదలైన పత్రికలు, సంస్థల నుంచి వివిధ సందర్భాలలో బహుమతులను పొందారు.